క్లుప్తంగా

నేడు వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

వీడీసీ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

కుంటాల: మండలంలోని విఠాపూర్ వీడీసీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదం దశరథ్, ఉపాధ్యక్షుడిగా ఓడమలు నర్సయ్య, కోశాధికారిగా జై కిషన్, రైటర్‌గా చంద్రకాంత్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, తుమ్మ సాయన్న, బోగ నారాయణ, లింగారెడ్డి, రమేశ్, నారాయణ్ పటేల్, లస్మన్న, పీరన్న తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని గ్రామస్తులు సన్మానించారు.

భైంసా అగ్నిమాపక అధికారిగా రవి

భైంసాటౌన్: అగ్నిమాపకశాఖ భైంసా అధికారిగా ఎం.రవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి అధికారిగా పనిచేసిన శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. రవి ఉట్నూర్‌లో పని చేయగా పదోన్నతిపై భైంసాకు వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

విరాళం అందజేత


విరాళం అందిస్తున్న శ్రీనివాస్

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటుకు లక్ష్మణచాందకు చెందిన నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ రూ.25 వేలను విరాళంగా గురువారం అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఓస రాజు, రవి, దొంతుల రాజు, హరీశ్, లచ్చన్న, నరేందర్, హనుమంతు తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

తానూరు: మండలంలోని ఉమ్రి(కే)లో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు మూడు రోజులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పనులు, ఖర్చు వివరాలను సభలో గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ పాండురంగ్, బీఆర్పీ తరుణ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి అవినాశ్, టీఏ పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదేశాల మేరకు భైంసా ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్ రూ.1.65 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫారూఖ్ అహ్మద్, డైరెక్టర్ దత్తురామ్ పాటిల్, ఖాలీద్‌ఖాన్, గంగాధర్, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

'ఆయిల్‌పాం'పై అవగాహన

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో ఉద్యానవన, పట్టుపరిశ్రమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా క్రాప్ మేనేజర్ రత్నాకర్‌రెడ్డి చీడపీడల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది అడెపు శేఖర్, యోగేశ్, రైతులు చిన్నారెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. గ్రామాల మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శబరిమలై తరలిన స్వాములు

భైంసాటౌన్: పట్టణంలోని కాలనీ నుంచి పలువురు అయ్యప్ప దీక్షాపరులు గురువారం శబరిమలై తరలివెళ్లారు. దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు.. గురుస్వాముల ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం యాత్రకు బయలుదేరారు. కాలనీ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు మోహన్, గురుస్వాములు శ్రీనివాస్, భూమేశ్ తదితరులు ఉన్నారు.

లాభాల్లో కుంటాల పీఏసీఎస్

- పంటల కొనుగోళ్లతో అందుతున్న కమీషన్
- ఆదాయంతో సొసైటీ నిర్వహణ
- హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు



కుంటాల పీఏసీఎస్ కార్యాలయం

కుంటాల: రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ ఆదాయం పొందుతూ ప్రగతి బాటలో పయనిస్తోంది కుంటాల పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం). కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా కర్షకుల నుంచి ధాన్యం, సోయా, జొన్నలు, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొంటూ వారి బ్యాంకు ఖాతాల్లో సకాలంలో డబ్బులను జమ చేస్తుంది. కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే లాభాలను సొసైటీ.. సిబ్బంది జీతభత్యాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ఖర్చు చేస్తుంది.

సకాలంలో జమ..

కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లింబా(కె), అంబకంటి, కుంటాలతోపాటు నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు పంట విక్రయించిన వారం రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖరీఫ్, యాసంగి సీజన్లకు సంబంధించి విత్తనాలు, ఎరువులను పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు సరఫరా చేస్తున్నారు. రెండు సీజన్లలో వరి, సోయా, మొక్కజొన్న, జొన్నలను కొంటున్నారు. కొనుగోళ్ల డబ్బులను సకాలంలో జమ చేస్తుండడంతో రైతులు సైతం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు.


కుంటాల కొనుగోలు కేంద్రంలో తేమశాతం పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పనితీరే ప్రామాణికం..

నాబార్డు.. రుణాలను మంజూరు చేసే సమయంలో పీఏసీఎస్ పనితీరు పరిగణనలోకి తీసుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

సంవత్సరాల వారీగా సమకూరిన ఆదాయం..

- 2022లో కుంటాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో 830 మంది రైతుల వద్ద 30,848 క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేశారు. రూ. 6.కోట్ల79లక్షల73,124ను రైతుల ఖాతాల్లో జమ చేయగా సొసైటీకి రూ.9.88లక్షల ఆదాయం వచ్చింది.
- 2023లో 858మంది రైతుల వద్ద 33,593 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేయగా రూ.7కోట్ల 65 లక్షల 91 వేల 584ను రైతుల ఖాతాల్లో జమ చేయగా సొసైటీకి రూ.10.34 లక్షల ఆదాయం సమకూరింది. సోయా 476 మంది రైతుల నుంచి 8,749 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసి రూ.2 కోట్ల 78 లక్షల 20,230ను రైతుల ఖాతాల్లో జమ చేయగా సొసైటీకి రూ.మూడు లక్షల ఆదాయం వచ్చింది. యాసంగిలో మొక్కజొన్న కొనుగోళ్లకు గాను వచ్చిన లాభం రూ.26.28 లక్షలు.
- 2024లో 597 మంది రైతుల వద్ద 22,817 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.5 కోట్ల 29 లక్షల 23 వేల 840ను రైతుల ఖాతాల్లో జమ చేయగా సొసైటీకి రూ.7.30 లక్షల ఆదాయం వచ్చింది. మరోవైపు 659 మంది రైతుల నుంచి 10,113 క్వింటాళ్ల సోయా పంటను కొనగా సొసైటీకి రూ.5 లక్షల ఆదాయం సమకూరింది.

సొసైటీకే విక్రయించా



మొదటిసారిగా కుంటాలలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. 15 క్వింటాళ్ల సోయా పంటను సొసైటీకి విక్రయించాను. సకాలంలో డబ్బులను జమ చేశారు. వచ్చే సారి కూడా సంఘంలోని కొనుగోలు కేంద్రంలోనే పంటను అమ్ముకుంటా. – జక్కుల ముత్యం, కుంటాల

ప్రతీ గింజను కొనుగోలు చేశాం



దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి వచ్చిన ప్రతీ గింజనూ కొనుగోలు చేశాం. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాం. వారం రోజుల్లో ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నాం. – నాగభూషణం, సీఈవో

ఆదాయం సమకూరుతోంది



పంట కొనుగోళ్ల ద్వారా పీఏసీఎస్‌కు కమీషన్ అందుతుంది. దీంతో రైతులకు విత్తనాలు, ఎరువులను సరఫరా చేస్తున్నాం. సోయా, వరి, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లతో సంఘానికి ఆదాయం సమకూరుతుంది. – సట్ల గజ్జారాం, పీఏసీఎస్ చైర్మన్, కుంటాల

ప్రజల కోసం స్థాయికి మించి కష్టపడతా

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: తనను ఆదరించి అండగా నిలబడ్డ ప్రజల రుణం తీర్చుకునేందుకు స్థాయికి మించి కష్టపడి అభివృద్ధి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండరేవుతండాలో నానూమహరాజ్, జగదాంబదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడు తూ జిల్లా ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. రావుల రాంనాథ్, విలాస్, నారాయణరెడ్డి, రాంశంకర్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.


సారంగపూర్ : ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పరిమండల్‌లో..

మామడ: ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పరిమండల్ గ్రామంలో గురువారం భీమన్న ఆలయం, జయరాంతండాలో ధ్యాన మందిరం సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయాలు ఆధ్యాత్మికత, ప్రశాంతతకు నిలయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, రాజారెడ్డి, మల్లేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని వైఎస్సార్‌కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గురువారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నేతలు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు సమస్య పరిష్కరించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. కాలనీలో డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నేతలు ఉయిక భీంరావు, పంద్రం ఆనంద్, ఆత్రం అర్జున్, దర్వ నాగోరావు, ఈశ్వర్, రాము, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికే బూత్ కమిటీల ఎన్నిక

కుంటాల: క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకే గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌట్టి అశోక్‌కుమార్, క్రియాశీల సభ్యత్వ మండల ఇన్‌చార్జి సాయి సూర్యవంశీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సూర్యాపూర్, ఓలా గ్రామాల్లో పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఓలాలో 56వ బూత్ అధ్యక్షుడిగా రోడ్డ ప్రవీణ్, 57వ బూత్ అధ్యక్షుడిగా ఆమెడ కిషన్, 58వ బూత్ అధ్యక్షుడిగా వేముల సాయికుమార్, సూర్యాపూర్‌లో 53వ బూత్ అధ్యక్షుడిగా బక్కి సురేశ్, కార్యదర్శిగా రోడ్డ ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కట్ట రవి, శరత్‌గౌడ్, రాజన్న సిందె దత్తు పటేల్, చంద్రశేఖర్, రమేశ్, నారాయణ, సాయినాథ్‌పటేల్, గోవింద్, నాగలింగం భోజన్న, భీందాస్, గంగాధర్, నవీన్, బాలు, అంకుశ్, సందీప్ ముత్యం తదితరులు పాల్గొన్నారు.


ఓలాలో అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్, వడ్యాల్, పొట్టపెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు ఆధ్వర్యంలో గురువారం బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు పలాస గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, ముత్యంరెడ్డి, రామ్‌రెడ్డి, రాజు, మోహన్ తదితరులు న్నారు.

బాసరలో..

బాసర: మండలంలోని 13 పోలింగ్ బూత్‌లకు కమిటీలను ఎన్నుకున్నట్లు బీజేపీ మండల ఇన్‌చార్జి పుట్నాల సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో 253వ పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా దత్తు, 254వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా సైబ్రావ్ 255వ బూత్‌కు యోగేశ్ 257వ బూత్‌కు అనిల్ 258వ బూత్‌కు జెల్లు, 259వ బూత్‌కు కల్పన, 260వ బూత్‌కు గణేశ్, 261వ బూత్‌కు రవి, 262 బూత్‌కు భోజన్న, 263వ బూత్‌కు దత్తు, 264వ బూత్‌కు జ్యోతి, 265వ బూత్‌కు దేవేందర్, 266వ బూత్‌కు గణేశ్‌ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపునకు కృషి చేయాలని సాయినాథ్ కోరారు.


బాసరలో నియామక పత్రం అందిస్తున్న నేతలు

ఘనంగా వీర్ బాల్ దివస్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి నిర్మల్‌లోని గురుద్వార వరకు ర్యాలీగా బయలుదేరారు. ఈసందర్భంగా గురుద్వారలో జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిక్కుల పదో గురువు గురుగోవింద్ సింగ్ కుమారులు జూరావర్ సింగ్, పతే సింగ్ ధైర్య సాహసాలకు గుర్తుగా ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ జరుపుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కౌన్సిలర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆరో రోజుకు సమ్మె

ఖానాపూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఆరోరోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లక్ష్మి, నర్సవ్వ, విజయ, భాను ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ గండిరామన్న దత్తసాయి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్మన్ గంగోని బూరాజ్ అన్నారు. గురువారం ఆలయంలో చైర్మన్‌తోపాటు ధర్మకర్తలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త కత్తి సురేశ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు గాజుల రవికుమార్, శ్యామకూర రాము, సయ్యద్ అజహర్, శ్రీహరి, నర్సారెడ్డి, మహేందర్ తదితరులు ఉన్నారు.

విజేతగా ఖానాపూర్ జట్టు

ఖానాపూర్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగిన ఎంఎస్‌డీ క్రికెట్ టోర్నీ విజేతగా ఖానాపూర్ జట్టు నిలిచినట్లు క్రీడాకారులు తెలిపారు. విజేత ఖానాపూర్ జట్టుతోపాటు రన్నరప్‌గా నిలిచిన కోరుట్ల క్రికెట్ జట్లకు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్ బహుమతులు ప్రదానం చేశారు.

టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వ్యాధి నిరోధక టీకాలను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎన్‌ఎం పద్మ, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని బర్కత్‌పుర అంగన్వాడీ కేంద్రంలో టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ శని, బుధ వారాల్లో జరిగే కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమగ్ర ఉద్యోగుల భిక్షాటన

నిర్మల్‌రూరల్: ప్రభుత్వం జీతాలు పెంచి తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. తమను విద్యాశాఖలో వి లీనం చేయాలని డిమాండ్ చేశారు. 20ఏళ్లుగా పని చేస్తున్న వారందరికీ 30 శాతం వెయిటేజ్ ప్రకటించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మురళి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్ శిబిరం సందర్శించి నిరసనకు మద్దతు ప్రకటించారు. గంగాధర్, రాజారత్నం, తిరుమల, గోదావరి, సౌజన్య, సునీత, పోసాని ,లక్ష్మణ్, భోజన్న, రవి, సమత, సుమతి, సునీత, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.


భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి

సోన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పూల మొక్క నాటారు. కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు రోడ్లపై నడవకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై గోపి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

'ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించొద్దు'

నిర్మల్‌రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై వారి స్థానాల్లో పంపించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపడం వలన.. విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మహాసభలు విజయవంతం చేయండి

నిర్మల్‌రూరల్: నల్లగొండలో ఈనెల 28, 29, 30వ తేదీల్లో విద్య, వైజ్ఞానిక రాష్ట్ర ఆరో మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో గురువారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వం ఈనెల 28, 30 తేదీల్లో ఆన్ డ్యూటీగా అనుమతించిందని.. ఉపాధ్యాయులు సదస్సుకు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. అతిథులుగా శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ట్రెయినీ ఎఫ్‌బీవోల పర్యటన



ఐ లవ్ కవ్వాల్ లోగో వద్ద ట్రెయినీ ఎఫ్‌బీవోలు

కడెం: దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన ట్రెయినీ ఎఫ్‌బీవోలు గురువారం మండలంలోని పాత మైసంపేట్ గ్రామాన్ని సందర్శించారు. దోస్తనగర్ నుంచి పాత మైసంపేట్ వరకు సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. అటవీవన్యప్రాణుల సంరక్షణ, గడ్డి క్షేత్రాల పెంపకం గురించి కల్లెడ డీఆర్వో ప్రకాశ్ వీరికి అవగాహన కల్పించారు. కోర్సు డైరెక్టర్ రామ్మోహన్, ఎఫ్‌బీవో ప్రసాద్, హైటీకాస్ ప్రతినిధి వెంకట్, అటవీ సిబ్బంది ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


కుటుంబసభ్యులతో పూర్వవిద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఆడుతూ పాడుతూ చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం తలోదారి పట్టారు. అలా దూరమైన మిత్రులు గురువారం పూర్వవిద్యార్థులుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ అంతులేని ఆనందానికి వేదికగా నిర్మల్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రం నిలిచింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ (బాలురు) కళాశాలలో 1985–87లో ఇంటర్ పూర్తి చేసిన 15 మంది తమ కుటుంబసభ్యులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. సుమారు 40 ఏళ్ల తర్వాత కలుసుకొని ఉల్లాసంగా సందడిగా గడిపారు. ఏటా కలుసుకోవాలని వారంతా నిర్ణయించుకున్నారు. గడ్డం రామకృష్ణారెడ్డి, అశోక్ కుమార్, డి.రాజశేఖర్, మాన్పూరి కిషన్, వెంకట్, శంకర్, నరహరి, గంగాధర్, రాజేందర్, రాజు, విద్యాసాగర్, చారి, విశ్వేశ్వర్‌రావు, రమణ, నాగభూషణం పాల్గొన్నారు.

నమూనా పరీక్ష

కుంటాల: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గురువారం స్థానిక సృజన విద్యానిలయం పాఠశాలలో నమూనా ప్రవేశపరీక్ష నిర్వహించారు. 600 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, శ్రీకాంత్, గజానన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.